


పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

బొల్లాపల్లి: వినుకొండ నుంచి 20 మందితో మర్రివేముల వెళుతున్న ఆర్టీసీ బస్సు వెల్లటూరు వద్ద ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఎవరూ గాయపడలేదు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 563.10 అడుగులకు చేరింది. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

శాకంబరిగా భవానీ అమ్మవారు



సత్తెనపల్లి: ఆషాఢ మాసం పురస్కరించుకొని స్థానిక అమ్మిశెట్టివారివీధిలో ఉన్న త్రికోటేశ్వర స్వామి గుడిలో భవానీ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.

ఇక స్మార్ట్ షాక్

- జిల్లాలో ఇప్పటి వరకు 70,819 స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి

పీక్ అవర్స్‌లో అధిక బిల్లులు మోపి దోచుకునేందుకు కుట్ర



సత్తెనపల్లి శ్రీనివాస థియేటర్‌లో స్మార్ట్ మీటర్ బిగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది (ఇన్‌సెట్‌లో) స్మార్ట్ మీటర్లు

సత్తెనపల్లి: విద్యుత్ శాఖలో స్మార్ట్ మీటర్లను బలవంతంగా ప్రజల నెత్తిన పెట్టేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు జరుగుతోంది. త్వరలోనే గృహ, వ్యవసాయ కనెక్షన్లకు అమర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. దీనిపై వినియోగదారుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

చంద్రబాబు, లోకేష్ తీరుపై విమర్శలు ...

నాడు ప్రతిపక్షంలో ఉండగా వ్యవసాయ బోరుబావుల వద్ద స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్ ప్రస్తుతం వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సన్నాహాలు ప్రారంభించడంపై రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లాలో ఇలా...

జిల్లా వ్యాప్తంగా 7,77,718 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ సంస్థలవి 12,613, ప్రైవేట్ కనెక్షన్లు 7,65,105 ఉన్నాయి. ప్రస్తుతం 70,819 స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ సంస్థలకు 10,842 స్మార్ట్ మీటర్లు బిగించగా, ప్రైవేట్, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు 59,977 స్మార్ట్ మీటర్లు బిగించారు. ఇక ఇళ్లకు, వ్యవసాయ బోరుబావులకు స్మార్ట్ మీటర్లు బిగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రభుత్వ సబ్సిడీపై విద్యుత్ వినియోగదారులకు, నామమాత్ర వినియోగదారులకు ఈ మీటర్లు బిగించరు.

రీచార్జి చేస్తేనే విద్యుత్...

సెల్‌ఫోన్, డిష్ టీవీ తరహాలో ముందస్తుగా స్మార్ట్ మీటర్‌కు రీచార్జి చేసుకోవాలి. రీచార్జ్ అమౌంట్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్తు ఎంత వినియోగించారు.. రీచార్జి ఎప్పటికీ పూర్తవుతుందన్న సమాచారం వినియోగదారుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో వస్తుంది. ఈ విధానం ఇబ్బందులకు గురిచేయనుందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు

ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూళ్లు ఏపీ సీపీడీసీఎల్ అధికారులకు తలనొప్పిగా మారింది. ఆయా కార్యాలయాలు ఎప్పుడు చెల్లిస్తే అప్పుడు తీసుకోవాల్సిన పరిస్థితి. దీంతో బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. విద్యుత్ సంస్థకు భారీ నష్టాలు వస్తున్నాయి. అదే స్మార్ట్ మీటర్లు బిగిస్తే తప్పకుండా రీచార్జి చేసుకోవాలి. లేదంటే విద్యుత్ సరఫరా ఉండదు.

మీటర్ భారం వినియోగదారుడు పైనే...

స్మార్ట్ మీటర్ ఖరీదును వినియోగదారుడే భరించాలి. సింగిల్ ఫేజ్ మీటర్ ఖరీదు రూ. 8,927. త్రీఫేజ్ మీటర్ రూ.17,286. ఈ మొత్తాన్ని 93 నెలల పాటు ఇన్‌స్టాల్‌మెంట్లుగా బిల్లుతో పాటు వసూలు చేస్తారు. స్మార్ట్ మీటర్‌ను రిమోట్ నుంచి ఆపరేట్ చేయవచ్చు. పీక్ సమయం పేరుతో అధిక చార్జి వసూలు చేసేందుకు ఇది ఎంతగానో ఉపయుక్తం కానుంది. ఉదాహరణకు ఉదయం 6 గంటల నుంచి 10 వరకు, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు పీక్ సమయంగా నిర్ణయించారు. ఈ సమయంలో ఎక్కువ విద్యుత్ చార్జి వసూలు చేస్తారు. వేసవిలో ఎక్కువ రేట్లు వసూలు చేసే అవకాశం ఉంది.

గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డులో ప్రత్తిపాడు కళాశాల వద్ద లోలెవల్ చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



కుండపోత

- లోతట్టు ప్రాంతాలు, సాగు భూములు జలమయం
- గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డులో మునిగిన లో లెవల్ చప్టా
- మూడు జిల్లాల మధ్య నిలిచిన రాకపోకలు
- ప్రత్తిపాడులో తూముల సమస్యతో ఇళ్లలోకి మురుగునీరు

ప్రత్తిపాడు: మండలంలో కుండపోత వర్షం కురిసింది. గురువారం రాత్రితోపాటు శుక్రవారం ఉదయం నుంచి విడతల వారీగా 40.4 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రత్తిపాడు బస్టాండు వరకు గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డు చెరువును తలపించింది. మోకాలి లోతులో నీరు రోడ్లపై ప్రవహించడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. వాగులు, లోలెవల్ చప్టాలు ఉప్పొంగాయి. గొట్టిపాడు-ప్రత్తిపాడు, గనికపూడి- గొట్టిపాడు మధ్యనున్న లోలెవల్ చప్టాలపై వర్షపు నీరు ఉప్పొంగింది. ఆయా గ్రామాల మధ్య రాకపోకలు కొన్ని గంటలపాటు స్తంభించిపోయాయి. ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం, ఏబీ పాలెం, వంగిపురం ప్రాంతాల్లో సాగు భూములు సైతం చెరువులను తలపించాయి. గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై ప్రత్తిపాడులో ఎస్ఎంఎస్ అండ్ ఎస్ఎల్ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న లోలెవల్ చప్టాపై పెద్ద ఎత్తున నీరు ఉప్పొంగింది. గడంతో బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ఇళ్లలోకి చేరిన మురుగునీరు

ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధాన రహదారిలో పాతమల్లాయపాలెం కూడలి వద్దనున్న చిన్న తూముల వల్ల రెడ్ల రామాలయం నుంచి ఇందిరాగాంధీ బొమ్మ సెంటరు వరకు వర్షపు నీరు, మురుగు ఎగదన్ని ఇళ్లలోకి, అంతర్గత వీధుల్లోకి వచ్చింది. ఇంటి సామగ్రి దెబ్బతింది. రోడ్లపై నీరు మోకాలి లోతులో ప్రవహించడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. తూముల సమస్యను అధికార యంత్రాంగం పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో అధిక వర్షాలకు సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై ప్రత్తిపాడు పంచాయతీ అధికారులకు కూడా శుక్రవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

వాటర్ గ్రిడ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



విజయపురి సౌత్: మేకల గొంది నుంచి జల జీవన్ మిషన్ ద్వారా రూ.1200 కోట్లతో మాచర్ల నియోజకవర్గంతో పాటు పల్నాడు ప్రాంతానికి తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత స్థలాన్ని అధికారులు పరిశీలించారు. మేకల గొందిలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసే స్థలంలో సర్వే మ్యాపులను పరిశీలించారు.అన్ని అనుమతులు మంజూరయితే నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ, డీఎఫ్ఓ సందీప్ కుమార్, మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ రమేష్ పాల్గొన్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి పుట్టింటి చీరసారె సమర్పణ



రెంటచింతల: స్థానిక చౌడేశ్వరీ అమ్మవారికి శుక్రవారం ఆషాఢ మాస పుట్టింటి చీరసారెను సమర్పించగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు పి.అనీల్‌కుమార్‌శర్మ నేతృత్వంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం పెద్ద శెట్టి పల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ రాములవారి ఆలయం వద్ద నుంచి మేళతాళాలతో ఆషాఢ మాస పుట్టింటి చీరసారెను భక్తులతో కలిసి తీసుకువచ్చి, అమ్మ వారికి సమర్పించారు.

'స్వచ్ఛ' అవార్డు రావడం అభినందనీయం



నెహ్రూనగర్/గుంటూరు వెస్ట్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు జిల్లాకు అవార్డు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రశంసించారు. అవార్డును జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌కు చూపారు. ఇది సమష్టి కృషి ఫలితమని ఆమె పేర్కొన్నారు.కేంద్రం నుంచి 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ 2024-25' పోటీల్లో గుంటూరుకు లభించిన అవార్డు నగర ప్రజలు, ప్రజారోగ్య కార్మికులకు అంకితమని మేయర్ కోవెలమూడి రవీంద్ర చెప్పారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అవార్డు అందిన స్ఫూర్తితో సమగ్రాభివృద్ధి సాధిస్తామని తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి కృషితోనే గుర్తింపు లభించిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పెదకాకాని: శివాలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేడుకల చివరి రోజైన శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగా, 20వ తేదీన శ్రీ భ్రమరాంబ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి విశేష పూజలు చేయనున్నారు. స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, దాతలు నేలవెల్లి కోటేశ్వరి, కర్నే శివ సందీప్ నాగశిరీష, రెడ్డి నవీన్ కుమార్ విజయలక్ష్మీ, నేలివెల్లి నాగప్రత్యూష, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

'సర్వే'త్రా పచ్చపాతం !

- విస్తుగొలుపుతున్న బంగారు కుటుంబం జాబితా
- లబ్ధిదారుడిగా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న యువకుడు
- జాబితాలో ప్రభుత్వ ఉద్యోగిని కుమార్తె
- తూతూమంత్రంగా గ్రామాల్లో పి-4 సర్వే



నూజెండ్లలో ఓ లబ్ధిదారుడి భవనం



ఓ లబ్ధిదారుకు చెందిన షాపింగ్ కాంప్లెక్సు

నూజెండ్ల: 'మార్గదర్శి-బంగారు కుటుంబం' లబ్ధిదారుల జాబితాలో పేర్లు విస్తుగొలుపుతున్నాయి. పేదల స్థానంలో ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్న వారి పేర్లు ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వివరాలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రదర్శనకు ఉంచారు.

తొలి దశలో 2,288 మంది ఎంపిక

పేదరిక నిర్మూలనలో భాగంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించి వారిని అభివృద్ధి పథంలో నడపటానికి ప్రభుత్వం పి-4 సర్వే చేపట్టింది. ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. దీని ఆధారంగా నూజెండ్ల మండలంలో 16 సచివాలయాల పరిధిలో 2,288 మందిని అధికారులు ఎంపిక చేశారు. వీరికి పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి-4) విధానంలో ఆర్థిక చేయూతనందించి పేదరిక నిర్మూలన సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

నిబంధనలకు పాతర

పి-4 సర్వేలో లబ్ధిదారులను స్థితిగతుల ఆధారంగా ఎంపిక చేయాలి. సొంతిల్లు, పొలం, ద్విచక్ర వాహనంతో పాటు కుటుంబ సభ్యులు ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారా ? తదితర అంశాలు పరిగణలోకి తీసుకోవాలి. అయితే లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తే ఈ అంశాలేవీ కన్పించడం లేదు. నూజెండ్ల గ్రామంలో 51 మందిని ఎంపిక చేసిన విధానం చూస్తే చాలా లోపాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తుడైన మల్లంపాటి నాగార్జునరెడ్డి (31), కస్తూరిబా పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగస్తురాలి కూతురు గుడివాడ దీక్షిత (14) ఎంపిక కావడం సర్వే లోపాలను బహిర్గతం చేస్తోంది. గ్రామానికి చెందిన 20 ఎకరాలున్న ఓ భూస్వామి భార్య పేరు, గ్రామ సెంటర్‌లో కోట్ల రూపాయల విలువైన కాంప్లెక్సు, భూములు కలిగిన సీనియర్ సిటిజన్ మహిళ పేరు లబ్ధిదారుల జాబితాలో చేర్చడం విశేషం. అంతేగాక వివాహం జరిగి ఉద్యోగస్తుడైన భర్తతో కాపురానికి వెళ్లిన మహిళల పేర్లు సర్వేలో ఉన్నాయి.

గ్రామసభల ద్వారా పేర్లు తొలగిస్తాం



బంగారు కుటుంబాల జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే తొలగిస్తాం. ప్రతి సచివాలయ పరిధిలో గ్రామసభలు నిర్వహిస్తున్నాం. వీటిలో నిర్ధారణ తర్వాత నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

-పి.ఉమాదేవి, ఎంపీడీఓ

నానో ఎరువుల వినియోగం పెంచాలి

కొరిటెపాడు(గుంటూరు): నానో ఎరువుల వినియోగం పెంచాలని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇఫ్కో ఆధ్వర్యంలో కృషీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన నానో ఎరువుల విక్రయదారుల శిక్షణలో ఆయన మాట్లాడారు. నానో యూరియా, డీఏపీ, జింక్, కాపర్ వాడటం వల్ల కాలుష్యం తగ్గుతుందని స్పష్టం చేశారు. జిల్లా సహకార అధికారి వీరాచారి మాట్లాడుతూ నానో ఎరువులను రైతులు వాడాలని సూచించారు. ఒక బాటిల్ నానో యూరియా పిచికారి చేస్తే ఒక బస్తా యూరియా చల్లినట్టేనని తెలిపారు.

మానవ హక్కుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా లక్ష్మి



నాదెండ్ల: ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ మహిళా విభాగం వైస్ చైర్మన్‌గా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన మందపల్లి లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని కేంద్ర కార్యాలయం అధ్యక్షుడు ఆర్ .బాలరాజు నుంచి ఉత్తర్వులు అందాయి.

వాహన రాకపోకలకు అంతరాయం



కల్వర్టు నిర్మాణానికి తవ్విన గుంత

- హైవేపై కల్వర్టు నిర్మాణానికి తవ్విన గుంతతో అవస్థలు
- నల్లమల అటవీ ప్రాంతంలో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



భారీగా నిలిచిన వాహనాలు

వెల్దుర్తి : పల్నాడు జిల్లాలోని దావుపల్లి వద్ద నేషనల్ హైవే 565పై కల్వర్టును ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టర్లు గుంత తవ్వడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో భారీగా కురిసిన వర్షానికి వరద నీరు గుంతలో ప్రవహిస్తుండటంతో మార్కాపురం - మాచర్లకు వాహన రాకపోకలు శుక్రవారం నిలిచిపోయాయి. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రయాణికుల్లో కొందరు సర్వీ బాదులు ఏర్పాటు చేసి వాగు దాటారు. రెండు గంటల తరువాత వాగు శాంతించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కొరిటెపాడు (గుంటూరు): వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుంటూరు నగరం, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లోని శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆరు దుకాణాల్లో రూ.4.92 లక్షల విలువైన 1.13 టన్నుల ఎరువులు, ఏడు దుకాణాల్లో రూ.4,400 విలువైన 27.5 లీటర్ల పురుగు మందులు, 6 షాపుల్లో రూ.23.60 లక్షల విలువ గల 82.3 మెట్రిక్ టన్నుల విత్తనాల అమ్మకాలను సరైన పత్రాలు చూపని కారణంగా నిలిపివేశారు. దీంతోపాటు రూ.1.29 లక్షల విలువైన 78.57 లీటర్ల పురుగు మందులను స్వాధీనం చేసుకుని 6-ఏ కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

రేపు పల్నాడు జిల్లా స్థాయి చెస్ పోటీలు

మాచర్ల: అంతర్జాతీయ చదరంగం పోటీలను పురస్కరించుకొని ఈ నెల 20న ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని కోదండ రామాలయంలో వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ, పల్నాడు చెస్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కోచ్ కిరణ్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులకు పోటీల వివరాలు తెలిపారు. రూ. 100 ఎంట్రీ ఫీజు కట్టి పాల్గొనాలన్నారు. మొదటి 10 స్థానాల్లో నిలిచిన వారికి నగదు, ట్రోఫీలు ఇస్తామని పేర్కొన్నారు. 7,9,11,13,15 వయసు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి, ముగ్గురు బాలికలకు పతకాలు బహుమతిగా ఇస్తామని తెలిపారు. వివరాలకు 9390059759 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మైక్రో ఆర్టిస్ట్ మహితకు కలెక్టర్ మురళి ఆర్థిక ప్రోత్సాహం



బాపట్ల : చీరాలకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ అన్నం మహిత జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని కార్యాలయంలో శుక్రవారం కలిశారు. అద్భుతమైన కళా ప్రతిభతో మహిత 93 పెన్సిల్స్‌పై నెల్సన్ మండేలా జీవిత చరిత్రను, మరో 810 పెన్సిల్స్‌పై మహాభారతంలోని 700 శ్లోకాలను అత్యంత సూక్ష్మంగా చెక్కి, అందరి ప్రశంసలు అందుకున్నారు. మహిత అసాధారణ ప్రతిభను కలెక్టర్ మురళి అభినందించారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్న ఆయన, తన వంతు సహాయంగా రూ.15వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య యాదవ్ పాల్గొన్నారు. కళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా కలెక్టర్ తీసుకున్న చొరవను పలువురు అభినందించారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి



రేపల్లె: చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. 2025–26 విద్యా సంవత్సరంలో దూర విద్య ద్వారా పదో తరగతి చదువు మానేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా స్టడీ సెంటర్ల నిర్వాహకులు పనిచేయాలని కోరుతూ పట్టణంలోని ఓ స్టడీ సెంటరులో శుక్రవారం వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ ఓపెన్ పదో తరగతి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈవో కేసనశెట్టి సురేష్, ఎంఈవో రత్నశ్రీధర్, వివిధ స్టడీ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

వదినపై పెట్రోల్ పోసి హత్య చేసిన మరిది

- గోడ నిర్మాణంలో అన్నదమ్ముల పిల్లల మధ్య వివాదం
- నిద్రిస్తున్న దంపతులపై పెట్రోల్ పోసి నిప్పు అంటించిన మరిది
- చికిత్స పొందుతూ వదిన మృతి
- అన్న పరిస్థితి విషమం
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ కె. నాగేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ ప్రభాకర్, ఎస్ఐ కృష్ణ. వెనుక నిందితుడు

నరసరావుపేట టౌన్: గోడ దగ్గర వివాదంలో వదినపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కె. నాగేశ్వరరావు తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన నీలబోయిన పెద్ద శ్రీనుకు అతని చిన్నాన్న కుమారుడైన నీలబోయిన యలమంద మధ్య గోడ కట్టుకునే విషయంలో గతంలో గొడవలున్నాయి. ఇటీవల శ్రీను పొలానికి వేసిన సోలార్ ఫెన్సింగ్ తగిలి యలమంద తమ్ముడి భార్య చిన్నమ్మాయికి కరెంట్ షాక్ తగిలింది. ఈ విషయంపై ప్రశ్నించిన యలమందపై పెద్ద శ్రీను, భార్య మంగమ్మలు గొడవకు దిగారు. గొడవలు ఎందుకు.. కూర్చొని మాట్లాడుకుందామని యలమంద కోరగా అతడ్ని అసభ్యకరంగా తిట్టారు. అది మనసులో పెట్టుకొని కక్ష పెంచుకొన్న యలమంద పెద్ద శ్రీను, మంగమ్మలను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఇంటి మరమ్మతులు చేయిస్తూ ఈ నెల 15వ తేదీన పొలంలో పొగాకు నిల్వ కోసం వేసిన షెడ్‌లో పెద్ద శ్రీను, మంగమ్మలు నిద్రిస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరిపై వెంట తెచ్చిన పెట్రోల్ పోసి, నిప్పు అంటించి యలమంద పారిపోయాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ మంగమ్మ చికిత్స పొందుతూ రెండవ రోజు మృతి చెందినట్లు డీఎస్పీ తెలిపారు. పెద్ద శ్రీను పరిస్థితి కూడా విషమంగా ఉందని, గుంటూరు ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. సమావేశంలో వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్, ఐనవోలు ఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

లాడ్జిలో అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



వీరాంజనేయరెడ్డి మృతదేహం

పిడుగురాళ్ల: పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద గల ఆర్‌ఆర్ లాడ్జిలో అనుమానాస్పదస్థితిలో శుక్రవారం వ్యక్తి మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల మేరకు..చిన్నగార్లపాడు గ్రామస్తులు చింతలచెరువు వీరాంజనేయరెడ్డి(38), లారీ డ్రైవర్ షేక్ కిరణ్ కలిసి గురువారం రాత్రి లాడ్జిలో రూం తీసుకుని మద్యం తాగారు. తెల్లవారుజామున షేక్ కిరణ్ డ్యూటీ ఉందని వెళుతూ వీరాంజనేయరెడ్డిని నిద్ర లేపాడు. అయినా లేకపోవడంతో మంచి నిద్రలో ఉన్నాడని అనుకొని వెళ్లిపోయాడు. ఆ తర్వాత బాయ్ వచ్చి చూసేసరికి వీరాంజనేయరెడ్డి చనిపోయి ఉన్నాడు. లాడ్జీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు, సిబ్బంది చేరుకున్నారు. మృతుడు ఏడు నెలల కిందట చినగార్లపాడు నుంచి పిడుగురాళ్ల పట్టణానికి వచ్చి ఉంటున్నాడు. కొంత కాలం కిందట గుండె పోటు రావడంతో ఆయనకు బైపాస్ సర్జరీ జరిగింది. మృతుని బంధువుల దిన కార్యక్రమానికి హాజరై, భోజనాన్ని క్యారేజీలో తీసుకొని రూంలోకి తీసుకెళ్లి తిన్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ వీరాంజనేయరెడ్డి మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. బంధువులు అనుమానాస్పద మృతిగా భావిస్తున్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య



తులసి(ఫైల్)

పెదకూరపాడు: క్షణికావేశానికి లోనై యువతీ, యువకులు నిండు నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే ముగిస్తున్నారు. పురుగు మందు తాగి బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని కన్నెగండ్లలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన గోగులపాటి బ్రహ్మనాయుడు, పిచ్చమ్మలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె తులసి(17) గత ఏడాది పెదకూరపాడు జెడ్పీ హైస్కూలులో పదో తరగతి పూర్తిచేసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం తల్లి పిచ్చమ్మ ఉపాధి పనులకు, తండ్రి బ్రహ్మనాయుడు బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న గడ్డి మందును తులసి తాగింది. చెల్లి గమనించి బిగ్గరగా కేకలు వేయగా, చుట్టపక్కల వారు వచ్చి తొలుత సత్తెనపల్లి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తులసి మృతి చెందింది. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో తల్లిదండ్రులు ఆమె చదువును ఆపేయించారు. దీంతో మనస్తాపం చెందిన పురుగు మందు తాగినట్లు తెలుస్తోంది. పెద్దకుమార్తె మృతితో బ్రహ్మనాయుడు కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

అక్రమ కేసులో విచారణకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హాజరు

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత నెల 18వ తేదీన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన నేపథ్యంలో జన సమీకరణ చేశారంటూ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిపై సత్తెనపల్లిలో మరో అక్రమ కేసు నమోదైంది. ఈ నెల 11న మొదటి కేసు విషయమై సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఆ సమయంలో రెండో కేసు ఊసును పోలీసులు ఎత్తలేదు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు రెండో కేసు నమోదు చేసి ఈ నెల 16న విచారణకు హాజరు కావాలంటూ హడావుడిగా నోటీసులను గుంటూరు కొచ్చి అందించారు. దీనిలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ విచారణ నిమిత్తం సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషనుకు హాజరై, సీఐ ఎంవీ సుబ్బారావు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆయన వెంట పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, పల్నాడు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, నాయకులు మందపాటి శేషగిరిరావు, చల్లంచర్ల సాంబశివరావు, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, గుజ్జర్లపూడి సతీష్, గుజ్జర్లపూడి కృపారావు తదితరులు ఉన్నారు.

జీవన ఎరువులతో ఆరోగ్యకర దిగుబడులు

డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శివకుమారి



రైతులకు మినుములు, కందులు పంపిణీ చేస్తున్న డీడీఏ శివకుమారి

సత్తెనపల్లి: సాగులో ఫాస్ఫరస్ సాలుబు లైజింగ్ బాక్టీరియా, అజోల్లా, వామ్ తదితర జీవన ఎరువులు వాడుకుని ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించాలని పల్నాడు జిల్లా రైతు శిక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(డీడీఏ) ఎం.శివకుమారి సూచించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలని ఆమె చెప్పారు. మండలంలోని గుడిపూడిలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ ఆఖరి దుక్కిలో ఫాస్ఫరస్ వేసుకోవాలని, దీనివల్ల వేరు వ్యవస్థ అభివృద్ధి చెంది అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. నారు మడిలో చల్లుకునే ముందు శిలీంధ్ర నాశిని అయిన కార్బెండిజం మూడు గ్రాములను కేజీ వరి విత్తనాలకు కలిపి, విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా విత్తన దశ నుంచే తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారిణి ఎం.అరుణ మాట్లాడుతూ తొలకరి వర్షాలకు నవ ధాన్యాలను సాగు చేసుకొని పూత దశలో భూమిలో కలియ దున్నుకోవాలని చెప్పారు. దీని వల్ల సూక్ష్మజీవులు బాగా అభివృద్ధి చెంది, భూమి సారవంతం అవుతుందని వివరించారు. సత్తెనపల్లి మండల వ్యవసాయధికారి బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పత్తి, మిరప, వరి సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులను వేసి, పూత దశలో భూమిలో కలియ దున్నుకోవాలని సూచించారు. మిరప రైతులు షేడ్ నెట్ లలో నారు పెంచుకోవాలని ఆమె చెప్పారు. అనంతరం జాతీయ ఆహార భద్రత పథకం కింద 100 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేసిన మినుములు, కంది విత్తనాల చిరు సంచులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

యడ్లపాడు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈడీ) కోర్సులో ప్రవేశానికి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం జిల్లా విద్యాశిక్షణసంస్థలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.చంద్రకళ మాట్లాడుతూ 2025–26 విద్యాసంవత్సరానికి గాను డీఈఈ సెట్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాకు 264 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరిలో బోయపాలెం డైట్ కళాశాలకు 108 మంది, నరసరావుపేట ఎంఏఎం డీఎడ్ కళాశాలకు 100 మంది, చెరుకుపల్లి మండల కనగాల జీనత్ అమరాబి డీఎడ్ కళాశాలకు 56 మంది ఎంపిక అయినట్లు వివరించారు. ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన షెడ్యూల్ ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి డైట్ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమైందన్నారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాలకు సంబంధించి మూడు ప్రత్యేక బృందాలను దరఖాస్తుదారుల పత్రాలను పరిశీలనకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిశీలన కార్యక్రమంలో డీవైఈవో ఎస్‌ఎం సుభాని, డైట్ అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారని ఆమె వెల్లడించారు.

‘అక్షర ఆంధ్ర’ను విజయవంతం చేయాలి

వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కె.ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

నరసరావుపేట: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ‘అక్షర ఆంధ్ర’ను సమర్థంగా నిర్వహించి విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు కె.ఆంజనేయులు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులకు చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పించాలని సూచించారు. డిజిటల్ లిటరసీ, ఫైనాన్సియల్ లిటరసీలను విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. జిల్లాలోని 1,27,565 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారుల సహకారంతో ఆగస్టు ఏడో తేదీన అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించాలని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి నిరక్షరాస్యులకు విద్య నేర్పించి, ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదే మార్చిలో నిర్వహించే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన మదింపు పరీక్ష నిర్వహణకు సంపూర్ణ సహాయ, సహకారాలు అందించాలని వివిధ శాఖల అధికారులను కోరారు. వయోజన విద్యాశాఖ తరఫున నిరక్షరాస్యులైన ప్రతి ఒక్కరికీ రెండు వాచకాలు, వర్క్ షీట్స్, దృశ్య శ్రవణ వీడియోలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వలంటీర్లను ఎంపిక చేసి ఒక్కొక్కరికీ పది మంది నిరక్షరాస్యులను అప్పగించాలని చెప్పారు. ఈనెల 26వ తేదీలోగా సమగ్రంగా నివేదికలు అందజేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఝాన్సీరాణి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ డీపీఎం వీరాస్వామి, ఐసీడీఎస్ పీడీ అరుణ, డీఈవో చంద్రకళ, జీఎస్‌డబ్ల్యూఎస్ వెంకట్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు వెస్ట్: పాత పెన్షన్ విధానాన్ని 2003 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని డీఎస్సీ–2003 ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మోపిదేవి శివశంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. తమకు నోటిఫికేషన్ వచ్చే నాటికి ఓపీఎస్ విధానం అమలు కాలేదన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన టెక్నికల్ తప్పుల వలంల తాము తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 57 ఇదే అంశాన్ని ధ్రువీకరిస్తోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సకాలంలో స్పందించకపోతే న్యాయ పోరాటం ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సలగల ప్రసన్న కుమార్, ఘంటసాల శ్రీనివాసరావు, నరసింహారావు, శ్రీలం యలమంద, మారెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూసార పరీక్ష ఫలితాలే కీలకం

- వాటి ఆధారంగా పంటకు నత్రజని ఎరువులు వాడాలి
- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కొరిటిపాడు(గుంటూరు): భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రైతులు పంటల్లో నత్రజని ఎరువులు వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కలకు కావాల్సిన ముఖ్య పోషకాల్లో నత్రజని కీలకమన్నారు. ఇది అమ్మోనియం, నైట్రేట్ రూపాల్లో దొరుకుతుందని పేర్కొన్నారు. పైరు పెరుగుదల సమయంలో దుబ్బులు చేయడంలోనూ, కొమ్మలు తొలగడంలోనూ ఈ ఎరువు ప్రభావం ఉంటుందని తెలిపారు. ఆకులు కూడా ముదురాకు పచ్చని రంగుతో ఆరోగ్యంగా కనిపిస్తాయని వెల్లడించారు. నత్రజని తగినంత ఉన్నప్పుడు మిగిలిన పోషకాలు కూడా సమర్థంగా అందుతాయని చెప్పారు. నత్రజని ఎరువులను అవసరమైన మేరకే మూడు దఫాలుగా వాడాలని, అధికంగా వేస్తే పైరు విపరీతంగా పెరిగి పడిపోవడం, పూత ఆలస్యంగా వచ్చి పంట కాలం పెరగడం, తాలు గింజల శాతం అధికం కావడం, చీడపీడలకు సులభంగా గురికావడం, దిగుబడి తగ్గిపోవడం జరుగుతుందని వివరించారు. నత్రజని లోపించినప్పుడు మొక్కల పెరుగుదల నెమ్మదిగాను, పొట్టిగాను ఉండిపోవడం, ఆకులు పాలిపోయి పసుపు పచ్చగా మారడం, ఫలసాయంలో మాంసకృతుల శాతం తగ్గిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. లోపం తీవ్రంగా ఉన్నప్పుడు ఆకుల కొనల నుంచి మధ్య వరకు క్రమంగా మాడిపోవడం, ముదురు ఆకులు ముందుగానే పసుపుగా మారి ఎండిపోయి రాలిపోవడం, పూత బాగా తగ్గి దిగుబడి పడిపోతుందని తెలిపారు. నత్రజని ఎరువులను పంటలకు అందించడానికి యూరియా లేదా అమ్మోనియం సల్ఫేట్ లేదా కాల్షియం అమ్మోనియం నైట్రేట్ లేదా అమ్మోనియం క్లోరైడ్ తదితర ఎరువులను వేసుకోవాలని సూచించారు. సమతుల ఎరువుల వాడకం భూసార పరీక్షల వల్ల మాత్రమే సాధ్యపడుతుందని చెప్పారు. భూసార పరీక్షఫలితాల ఆధారంగా నత్రజని ఎరువులను ఉపయోగించాలని జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: జోన్–3 పరిధిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఓరియెంటల్ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న అధ్యాపకులను 2025–26 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల విద్య ఆర్జేడీ పి. కళావతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యంలో 39, ఓరియెంటల్‌లో 10 చొప్పున పోస్టులను రెన్యువల్ చేసేందుకు గత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీ వరకు పని చేసిన 60 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

30 వరకు దూరవిద్య ప్రవేశాలకు అవకాశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లు నిండి, చదువు మధ్యలో ఆపేసిన అభ్యర్థులు పదో తరగతిలో, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. రెగ్యులర్ టెన్త్, ఇంటర్‌లలో ఫెయిలైన వారు చేరవచ్చని, 2025–26 విద్యాసంవత్సరానికి ఈ నెల 30 వరకు ప్రవేశాలకు అవకాశం ఉందని వివరించారు. సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు. ఏపీఓఎస్ఎస్‌లో గుర్తింపు పొందిన అధ్యయన కేంద్రాల జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.ఇన్ సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు తమకు సమీపంలోని అధ్యయన కేంద్రంలో అడ్మిషన్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.

పిల్లల సంరక్షణపై సర్టిఫికెట్ కోర్సు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల హోంసైన్స్ విభాగంలో నానీ కేర్ అండ్ న్యూట్రీషన్ (పిల్లల సంరక్షణ)పై ఏడాది వ్యవధి గల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను 2025–26 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూట్రీషన్, చైల్డ్‌కేర్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన పదో తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్న వారు అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 90592 00037, 95420 32539 ఫోను నంబర్లలో సంప్రదించాలనిప్రిన్సిపల్ సూచించారు.

రేపు బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పేరేచర్లలోని క్రీడా మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్లను నల్లమల జోన్ లీగ్ మ్యాచ్‌లకు పంపిస్తామని పేర్కొన్నారు. సీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 73375 85790లో కోచ్ బ్రహ్మంను సంప్రదించాలని ఆయన సూచించారు.